జ్వాల
# దశ
నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM
ఆదివారం
9-8-2026
సంపుటి 1 సంచిక 257
పేజీలు : 04
వెల : 1/-
PRGI No : TGTEL/25/A4195


# మెట్రో.. ఆర్టీసీ బస్సులకు కామన్ పాస్!


## ఒకే పాస్‌తో బస్సు, మెట్రో ప్రయాణం




**దశ, హైదరాబాద్ :** హైదరాబాద్ ప్రజా రవాణాను మరింత సులభతరం చేసేందుకు టీఎస్ఆర్టీసీ, హైదరాబాద్ మెట్రో కీలక నిర్ణయం తీసుకున్నాయి. మెట్రో రైళ్లు, ఆర్టీసీ బస్సుల్లో ఒకే పాస్‌తో ప్రయాణించేలా కామన్ పాస్ విధానాన్ని తీసుకురావాలని నిర్ణయించాయి. దీంతో బస్సు నుంచి మెట్రోకు, మెట్రో నుంచి బస్సుకు మారే ప్రయాణికులు వేర్వేరుగా టికెట్లు లేదా పాస్‌లు తీసుకోవాల్సిన అవసరం ఉండదు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాల మేరకు రవాణా శాఖ అధికారులు ఈ ప్రక్రియను వేగవంతం చేశారు. బస్ భవన్‌లో ఆర్టీసీ, హెచ్ఎంఆర్ఎల్, ఎల్అండ్‌టీ మెట్రో అధికారుల సమావేశంలో కామన్ పాస్ విధానంపై చర్చించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో రోజుకు సుమారు 22 లక్షల మంది ఆర్టీసీ బస్సుల్లో, 4.7 లక్షల మంది మెట్రోలో ప్రయాణిస్తున్నారు. కామన్ పాస్ అందుబాటులోకి వస్తే ప్రజా రవాణా వినియోగం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

# రేవంత్ లెక్కలోకి బనకచర్ల ప్రాజెక్ట్ రిజెక్ట్!

## కేంద్రం ప్రతిపాదనలు వెనక్కి.. ఏపీ ప్రాజెక్టుపై తెలుగు రాష్ట్రాల్లో హీట్




**దశ, హైదరాబాద్ :** పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ వేడి పెరిగింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలనుకుంటున్న ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలను కేంద్ర పర్యావరణ శాఖకు చెందిన నిపుణుల అప్రైజల్ కమిటీ వెనక్కి పంపడంతో రాజకీయ విమర్శలు మొదలయ్యాయి. తెలంగాణ ప్రభుత్వం దీనిని సీఎం రేవంత్‌రెడ్డి దౌత్యపరమైన విజయంగా ప్రచారం చేస్తుండగా.. ఏపీలో ప్రతిపక్షాలు కూటమి ప్రభుత్వానికి ఎదురుదెబ్బగా అభివర్ణిస్తున్నాయి.

అయితే ప్రాజెక్టు ప్రతిపాదనలు వెనక్కి పంపడం పూర్తిస్థాయి తిరస్కరణ కాదని, అవసరమైన సాంకేతిక, చట్టపరమైన ప్రక్రియలను పూర్తి చేసి మళ్లీ ప్రతిపాదనలను సమర్పించుకునే అవకాశం ఉందని నిపుణుల అభిప్రాయం. భారీ నదీ అనుసంధాన ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు పొందే ముందు నీటి లభ్యత, అంతర్రాష్ట్ర జల వాటాలు, ముంపు ప్రభావం వంటి అంశాలపై సమగ్ర అధ్యయనాలు అవసరం. ముఖ్యంగా కేంద్ర జల సంఘం నుంచి నీటి లభ్యతపై స్పష్టమైన ధ్రువీకరణ లేకుండా పర్యావరణ అనుమతుల ప్రక్రియ ముందుకు సాగడం కష్టసాధ్యమే.

..మిగతా 4వ పేజీలో →



# 100 ఎకరాల్లో అత్యాధునిక బస్ డిపో

### గాజులరామారంలో భారీ టెర్మినల్..
### నగర ట్రాఫిక్‌కు చెక్ పెట్టేలా ప్రణాళిక

**దశ, హైదరాబాద్ :** హైదరాబాద్‌లో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేస్తోంది. నగరంలోకి ప్రతిరోజూ భారీ సంఖ్యలో ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు రాకపోకలు సాగిస్తుండటంతో ప్రధాన బస్ స్టేషన్లపై ఒత్తిడి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో గాజులరామారం సమీపంలో ఏకంగా 100 ఎకరాల్లో అత్యాధునిక బస్ డిపో, టెర్మినల్ నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది.

జగద్గిరిగుట్ట పరిసర ప్రాంతాల్లో ప్రస్తుతం 28 జిల్లా బస్సులు, 47 సిటీ బస్సులు కలిపి రోజుకు 404 ట్రిప్పుల వరకు నడుస్తున్నాయని కేంద్ర రహదారులు,

రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ లోక్‌సభలో వెల్లడించారు. ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఈటల రాజేందర్ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు.

..మిగతా 4వ పేజీలో →




# మద్యం ధరల పెంపు

### ఆగస్టు 15 తర్వాత కొత్త ధరలు?

**దశ, హైదరాబాద్ :** తెలంగాణలో మద్యం ధరలు పెంచేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. బడ్జెట్, మిడ్‌రేంజ్, ప్రీమియం బ్రాండ్లతో పాటు అన్ని రకాల మద్యం ధరలను సవరించే అంశంపై ఏర్పాటు చేసిన సబ్‌కమిటీ ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. దీనిని పరిశీలించిన అనంతరం ఎక్సైజ్ శాఖ తుది నిర్ణయం తీసుకోనుంది. ఆగస్టు 15 తర్వాత ఎప్పుడైనా కొత్త ధరలు అమల్లోకి వచ్చే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.

..మిగతా 4వ పేజీలో →

# హైడ్రాలో 150 ఉద్యోగాలు.. వేలల్లో అభ్యర్థులు!

### సరూర్‌నగర్ స్టేడియంలో తోపులాట.. ఉద్రిక్తత




**దశ, హైదరాబాద్ :** హైదరాబాద్‌లో కొద్దిపాటి ప్రభుత్వ ఉద్యోగాల కోసం నిరుద్యోగులు ఏ స్థాయిలో ఎదురుచూస్తున్నారో సరూర్‌నగర్ స్టేడియంలో చోటుచేసుకున్న ఘటన స్పష్టం చేసింది. హైడ్రా ప్రకటించిన కేవలం 150 పోస్టుల కోసం వేలాది మంది యువత తరలిరావడంతో స్టేడియం వద్ద తీవ్ర తోపులాట జరిగింది. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

**150 పోస్టులకు భారీ పోటీ**

హైడ్రా విభాగంలో 100 డీఆర్ఎఫ్ అసిస్టెంట్‌లు, 50 హెవీ వెహికల్ డ్రైవర్ల పోస్టుల భర్తీకి అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. వీటి కోసం ఆగస్టు 8, 9 తేదీల్లో సరూర్‌నగర్ స్టేడియంలో ఉదయం 5 గంటల నుంచి ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహిస్తున్నారు.

..మిగతా 4వ పేజీలో →



# క్యాంపస్ లైఫ్.. రియల్ లైఫ్‌కు చాలా తేడా

### జీవితానికి సిలబస్ ఉండదు.. సమస్యను మీరే గుర్తించాలి: ప్రధాని మోదీ

**దశ, న్యూఢిల్లీ :** ఐఐటీ ఢిల్లీలో జరిగిన 57వ స్నాతకోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరై పట్టభద్రులైన 3,000 మందికిపైగా విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా సోనిపట్ క్యాంపస్‌లో ఏఐ ఆధారిత సూపర్ కంప్యూటింగ్ కేంద్రం 'పరంప్రజ్ఞ'ను ప్రారంభించారు. క్యాంపస్ జీవితానికి, బయట జీవితానికి చాలా తేడా ఉంటుందని ప్రధాని మోదీ అన్నారు.

..మిగతా 4వ పేజీలో →

# రేవంత్ కు రైతులపై కనీస పరిజ్ఞానం లేదు



### క్షుద్ర రాజకీయాలు మాకు తెలియవు.. కేటీఆర్ ఫైర్.

వివరాలు 4లో..

# కాక్రోచ్ పార్టీకి నిధులెలా వస్తున్నాయ్?

### నాయకుల ఆర్థిక వ్యవహారాలపై ప్రశ్నలు.. పారదర్శకతపై చర్చ

**దశ, న్యూఢిల్లీ:** కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కార్యకలాపాలు, ఆ పార్టీ నాయకుల ఆర్థిక వ్యవహారాలపై పలు ప్రశ్నలు, చర్చలు తెరపైకి వస్తున్నాయి. ఉద్యమాలు, సమావేశాలు, ప్రయాణాలు నిర్వహించేందుకు అవసరమైన నిధులు ఎక్కడి నుంచి సమకూరుతున్నాయి? నాయకుల జీవనశైలికి ఆర్థిక వనరులు ఏమిటి? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

..మిగతా 4వ పేజీలో →



# 40 ఆధార్ నంబర్లు.. 80 మంది ఉద్యోగులు!

### ఒకే గుర్తింపుతో రెండు ఉద్యోగాలు.. నెలకు రూ.లక్షల్లో జీతాలు.

**దశ, హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వ పాలనా యంత్రాంగంలో విస్తుపోయే అక్రమం వెలుగులోకి వచ్చింది. ఒకే ఆధార్ నంబర్‌తో వేర్వేరు పేర్లతో ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తూ.. రెండు చోట్ల నుంచి జీతాలు పొందుతున్న వ్యవహారం రాష్ట్ర ఆర్థిక శాఖ చేపట్టిన సాంకేతిక తనిఖీల్లో బయటపడినట్లు సమాచారం.

..మిగతా 4వ పేజీలో →

# పెద్ది కుటుంబానికి కేసీఆర్ అండ

### రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం ప్రకటించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

**దశ, హైదరాబాద్ :** దివంగత నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అండగా నిలిచారు. పార్టీ తరఫున పెద్ది కుటుంబానికి రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించారు. ఆయన ఇద్దరు పిల్లలకు చెరో రూ.కోటి చొప్పున, వృద్ధాప్యంలో ఉన్న వారి తల్లి అమృతమ్మ బాగోగుల కోసం మరో రూ.25 లక్షలు అందించనున్నారు. పిల్లల భవిష్యత్తు, విద్యతో పాటు కుటుంబ సంక్షేమాన్ని పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తూ అండగా ఉంటుందని కేసీఆర్ భరోసా ఇచ్చారు.

..మిగతా 4వ పేజీలో →



# బోనాల సందర్భంగా ప్రముఖ ఆలయాలకు పట్టు వస్త్రాలు

**దశ, హైదరాబాద్ :** ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా ఆగస్టు 9న హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లోని ప్రముఖ అమ్మవారి ఆలయాల్లో రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం తరఫున మంత్రులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ సలహాదారులను ప్రత్యేకంగా నియమించింది. ఉప్పుగూడ శ్రీ మహంకాళి ఆలయంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మీరాలం మండి శ్రీ మహంకాళి ఆలయంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. లాల్‌దర్వాజా శ్రీ సింహవాహిని మహంకాళి ఆలయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్,

..మిగతా 4వ పేజీలో →


ఫైల్ ఫోటో

## 10వ తేదీ నుంచి చేయూత పింఛన్లకు దరఖాస్తులు



**దశ, కోదేరు:** అర్హులైన వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, చేనేత, గీత కార్మికులు చేయూత పింఛన్ పథకానికి సోమవారం (10వ తేదీ) నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. దరఖాస్తు ఫారాలు మీసేవ కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, ఓటర్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ సమర్పించాలి. వికలాంగులు సదరం క్యాంపు సర్టిఫికెట్, గీత కార్మికులు సంబంధిత ఎక్సైజ్ శాఖ ధ్రువీకరణ పత్రాన్ని అందజేయాల్సి ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల వారు ఎంపీడీఓ కార్యాలయంలో, పట్టణ ప్రాంతాల వారు మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

## సొంత నానమ్మ పేరుతో ఫేక్ డెత్ సర్టిఫికెట్?

*కాంగ్రెస్ నేతపై బంధువుల ఆరోపణలు.. భూవివాదంలో దాడి కలకలం*




**దశ, చందానగర్:** శేరిలింగంపల్లి కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ దుర్గం శ్రీహరి గౌడ్‌పై ఆయన బంధువులు తీవ్ర ఆరోపణలు చేశారు. సొంత నానమ్మ పేరుతో నకిలీ డెత్ సర్టిఫికెట్ సృష్టించి భూమిని తన పేరుపైకి బదిలీ చేయించుకున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టినట్లు తెలిపారు. భర్త పేరుతో ఉన్న ఇంటి స్థలాన్ని తన పేరుపైకి బదిలీ చేసుకునేందుకు జీహెచ్ఎంసీ కార్యాలయానికి వెళ్లిన సమయంలో నకిలీ డెత్ సర్టిఫికెట్ వ్యవహారం వెలుగులోకి వచ్చిందని బాధితురాలు ఆరోపించారు. 2023లోనే నకిలీ ధ్రువపత్రం సృష్టించినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై ప్రశ్నించినందుకు శ్రీహరి గౌడ్, ఆయన సోదరుడు సతీష్ గౌడ్ తనపై, తన కుమారుడిపై దాడి చేశారని ఆరోపించారు. న్యాయం చేయాలని కోరుతూ బాధితులు శ్రీహరి గౌడ్ ఇంటి ముందు నిరసనకు దిగారు. ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నిస్తున్న విషయం తెలుసుకుని తమను చంపుతామని బెదిరిస్తున్నారని బాధితులు ఆరోపించారు. మరోవైపు, రాజకీయ ఒత్తిళ్ల కారణంగా నిందితులపై పోలీసులు కేసు నమోదు చేయడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలపై పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ జరిపితే అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## బంజారాహి ల్స్లో భారీ అగ్నిప్రమాదం



**దశ, హైదరాబాద్:** బంజారాహిల్స్ రోడ్ నంబర్ 11 లోని ఓ భవనం సెల్లార్లో దారు వల వైన్ మార్ట్ స్టాక్ స్టోరేజ్ భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సెల్లార్లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది 3 ఫైర్ ఇంజిన్లతో ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. చాలా సేపటివరకు మంటలు పూర్తిగా అదుపులోకి రాలేదు. సెల్లార్ నుంచి భారీగా పొగలు వెలువడ్డాయి. అగ్నిప్రమాదానికి గల కారణాలు, ఆస్తి నష్టం, ప్రాణనష్టంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# సాంకేతిక నైపుణ్యాలతో పాటు జీవిత విలువలూ అవసరం





- *విద్యార్థులు కొత్త ఆలోచనలతో భవిష్యత్ సవాళ్లను ఎదుర్కోవాలి*
- *శ్రేయస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా 16వ ఓరియెంటేషన్ డే*

**దశ, పెద్ద అంబర్ పేట :** మారుతున్న సాంకేతిక ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులు నూతన ఆలోచనలు, సాంకేతిక పరిజ్ఞానంతో పాటు కమ్యూనికేషన్, నాయకత్వం, సమస్య పరిష్కారం వంటి జీవిత నైపుణ్యాలను కూడా పెంపొందించుకోవాలని జేఎన్‌టీయూహెచ్ కూకట్‌పల్లి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం సీనియర్ ప్రొఫెసర్, రెక్టార్ డాక్టర్ అవుల దామోదరం సూచించారు. శ్రేయస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్) లో శనివారం 16వ ఓరియెంటేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ అవుల దామోదరం, అతిథిగా మల్కాజిగిరి కమిషనరేట్ రోడ్ సేఫ్టీ వింగ్ డీసీపీ ఐనపర్తి లక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ దామోదరం మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక రంగంలో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయని, వాటికి అనుగుణంగా విద్యార్థులు తమ ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలని అన్నారు. సంప్రదాయ ఆలోచనలకు పరిమితం కాకుండా కొత్త కోణంలో ఆలోచించి వినూత్నమైన ఐటీ విధానాలు, సాంకేతిక పరిష్కారాలను రూపొందించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

సాంకేతిక పరిజ్ఞానం ఒక్కటే విజయానికి సరిపోదని, వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్, నాయకత్వ లక్షణాలు, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం వంటి జీవిత నైపుణ్యాలు కూడా ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు తమ విద్యా దశ నుంచే భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు.

### క్రమశిక్షణ, సమయపాలనతోనే విజయానికి బాట

డీసీపీ ఐనపర్తి లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ చదువు, భవిష్యత్ లక్ష్యాలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యంగా మొదటి సంవత్సరం నుంచే మొబైల్ ఫోన్ వినియోగాన్ని నియంత్రించుకోవాలని, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. క్రమశిక్షణ, సమయపాలన, మంచి అలవాట్లు విద్యార్థుల విజయానికి బలమైన పునాదులుగా నిలుస్తాయని పేర్కొన్నారు. కళాశాల వైస్ చైర్మన్ అనంతుల హృదయ్ రెడ్డి, డాక్టర్ చింతల మేధాస్విని మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక విద్య ద్వారా విద్యార్థులకు ఐటీ రంగంలో ఉన్నత అవకాశాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గత 15 సంవత్సరాలుగా శ్రేయస్ కళాశాల విద్యా ప్రమాణాలతో పాటు ప్లేస్‌మెంట్లలోనూ మంచి ఫలితాలు సాధిస్తూ విద్యార్థులకు ఉత్తమ వేదికగా నిలుస్తోందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ నాణ్యమైన విద్యతో పాటు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలను విద్యార్థులకు అందించేందుకు కళాశాల నిరంతరం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ అనంతుల వినయ్ కుమార్ రెడ్డి, సెక్రటరీ చింతల రవీంద్రనాథ్ యాదవ్, విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. సుమారు 3,000 మందికి పైగా హాజరైన ఈ కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.



## ఉల్లాస్ సెంటర్ల బలోపేతానికి చర్యలు

- *టాస్ 10వ తరగతి, ఇంటర్ నమోదుపై అవగాహన*

**దశ, రంగారెడ్డి :** జిల్లాలో ఉల్లాస్ లెర్నింగ్ సెంటర్లను మరింత బలోపేతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ డా. కిరణ్మయి ఐఏఎస్ సూచించారు. ఆమె ఆదేశాల మేరకు జిల్లాలోని 27 మండల రిసోర్స్ సెంటర్లలో ఉల్లాస్ సెంటర్ల బలోపేతం, TOSS 10వ తరగతి, ఇంటర్ నమోదుపై అవగాహన సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో పీడీ మెప్మా, జీహెచ్ఎంసీ పీవోలు, మండల విద్యాశాఖ అధికారులు, SERPAPMలు, CCలు, VOAలు, రిసోర్స్ పర్సన్లు, SHG సభ్యులు పాల్గొన్నారు. నిరక్షరాస్య మహిళలకు ఉల్లాస్ పుస్తకాలు, TLM పంపిణీ చేశారు.

గ్రామాల్లోని నిరక్షరాస్య మహిళలను ఉల్లాస్ సెంటర్లకు హాజరయ్యేలా పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు కృషి చేయాలని డా. కిరణ్మయి సూచించారు. పనులకు వెళ్లే మహిళల కోసం సాయంత్రం 7 నుంచి 7.30 గంటల వరకు తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి ప్రాథమిక పాఠశాలలో ప్రతిరోజూ 3.30 నుంచి 4 గంటల వరకు ఉల్లాస్ తరగతులు నిర్వహించాలని తెలిపారు. 15 సంవత్సరాలు నిండిన అర్హులను TOSSలో 10వ తరగతి, ఇంటర్‌కు నమోదు చేయించాలని సూచించారు. కార్యక్రమాలను కె. అనిత, ఉప సంచాలకులు, వయోజన విద్య, రంగారెడ్డి జిల్లా పర్యవేక్షించారు.

## తప్పులులేని ఓటరు జాబితానే SIR లక్ష్యం: కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి. నారాయణ రెడ్డి



**దశ, రంగారెడ్డి :** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (SIR-2026) ద్వారా పారదర్శకమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందించడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి. నారాయణ రెడ్డి తెలిపారు. శుక్రవారం రాజేంద్రనగర్ ఆర్డీఓ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో SIR ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. ఆగస్టు 10లోగా ఎన్యుమరేషన్ ఫారాల కరెక్షన్, డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా తొలగిపోకూడదని, అదే సమయంలో అర్హత లేని వారి పేర్లు జాబితాలో ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆగస్టు 17న ముసాయిదా ఓటరు జాబితా, అక్టోబర్ 19న తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు తెలిపారు.

### పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక పరిశీలన

ప్రస్తుత ఓటర్ల సంఖ్య, భౌగోళిక పరిస్థితులు, ప్రజలకు అందుబాటులో ఉన్న సౌకర్యాల ఆధారంగా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. పేరు మార్పు, స్థల మార్పు, కొత్త కేంద్రాల ఏర్పాటు, కేంద్రాల విలీనం వంటి అంశాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. గేటెడ్ కమ్యూనిటీలకు సమీపంలో, నిబంధనలకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై కూడా పరిశీలన చేస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ఎల్‌బీ నగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహతో, రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ ఎస్. శ్రీనివాస్ రెడ్డి, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ అమిత్, డిఆర్ఓ శారద దేవి, ఎన్నికల విభాగం అధికారి రవీంద్ర గుప్తాతో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ మల్లేశంకు ఘన సన్మానం

**దశ ఓయూ:** వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ గడ్డం మల్లేశం బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఎస్సీ-ఎస్టీ ఆఫీసర్స్ ఫోరం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు నేతృత్వంలో శుక్రవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ భవన్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, గ్రూప్-1 అధికారులు, విద్యావేత్తలు, ప్రొఫెసర్లు, వైద్యులు, న్యాయవాదులు, విద్యార్థి సంఘాల నాయకులు, పరిశోధకులు, విద్యార్థులు హాజరై ప్రొఫెసర్ మల్లేశంను అభినందించారు. ESI డైరెక్టర్ డాక్టర్ గౌతమ్, డాక్టర్ సిద్ధోజ్, డాక్టర్ ప్రకాష్, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మంగు, మాజీ హెచ్‌ఓడీలు ప్రొఫెసర్ విద్యాసాగర్, ప్రొఫెసర్ రమణరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. విద్యారంగంలో విశేష అనుభవం, పరిపాలనా దక్షత, సామాజిక స్పృహ కలిగిన ప్రొఫెసర్ మల్లేశం నాయకత్వంలో వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం విద్య, సమానత్వం, మహిళా సాధికారతకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని అభిలషించారు.

ప్రొఫెసర్ మల్లేశం మాట్లాడుతూ.. మహిళల ఉన్నత విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, సామాజిక సాధికారతకు ప్రాధాన్యం ఇస్తూ విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. 'విద్య ద్వారా సాధికారత-సమాజ అభివృద్ధికి బలమైన పునాది' అనే లక్ష్యంతో పనిచేస్తామని పేర్కొన్నారు.



## పండుగ సాయన్న ఆశయాలను భావితరాలకు అందించాలి



- *ట్యాంక్‌బండ్‌పై సాయన్న విగ్రహం ఏర్పాటు చేయాలి*

**దశ సూర్యాపేట ప్రతినిధి :** పీడిత, బడుగు బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపేందుకు పోరాడిన తెలంగాణ బంధువు పండుగ సాయన్న జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని బీసీ జేఏసీ కన్వీనర్ బద్రబోయిన సైదులు అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద పండుగ సాయన్న జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల లేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో జన్మించి అణగారిన ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన పండుగ సాయన్న జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. ఆనాడే పెత్తందారులను ఎదిరించి పేద, బడుగు బలహీన వర్గాలకు విముక్తి కల్పించేందుకు పండుగ సాయన్న పోరాటం చేశారని తెలిపారు. ప్రజలకు తమ హక్కులపై అవగాహన కల్పించి, సామాజికంగా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని పేర్కొన్నారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్ సామాజిక వర్గంతో పాటు బడుగు బలహీన వర్గాలకు చెందిన మహనీయుల చరిత్రను ప్రభుత్వాలు గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. పండుగ సాయన్న వంటి మహనీయుల జీవిత చరిత్రలను అధికారికంగా నమోదు చేసి భావితరాలకు అందించాలని కోరారు. తక్షణమే ట్యాంక్‌బండ్‌పై పండుగ సాయన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్రంలోని పాఠ్యపుస్తకాల్లో పండుగ సాయన్న జీవిత చరిత్రను చేర్చి, ఆయన పోరాట స్ఫూర్తిని విద్యార్థులకు, భావితరాలకు పరిచయం చేయాలని కోరారు. పండుగ సాయన్న జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆయన ఆశయాలు, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటాలను రేపటి తరానికి అందించేందుకు బీసీ జేఏసీ నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ జిల్లా ఉపాధ్యక్షుడు బైరోజు మదనాచారి బీసీ చేసిన నాయకులు కూరాకుల శ్యాంసుందర్ కక్కిరేణి నాగేంద్రబాబు ముత్యం నాగేంద్రబాబు యోగి వీరు నరేష్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు

# ప్లాన్ బీలో రేవంత్..

❖ కర్ణాటక ఎఫెక్ట్‌తో కేబినెట్ విస్తరణలో కొత్త వ్యూహం



**దశ, హైదరాబాద్:** పొరుగు రాష్ట్రం కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వంలో చోటుచేసుకున్న పరిణామాలు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి కొత్త సవాళ్లను చూపిస్తున్నాయి. కర్ణాటకలో కేబినెట్ పునర్వ్యవస్థీకరణ తర్వాత మంత్రి పదవులు దక్కని సీనియర్ ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తం చేయడం, కొందరు రాజీనామాలకు సిద్ధపడటం కాంగ్రెస్ అధిష్ఠానానికి తలనొప్పిగా మారింది. దీంతో తెలంగాణలో చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న కేబినెట్ విస్తరణ విషయంలో రేవంత్ ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.

తెలంగాణలో ఖాళీగా ఉన్న మంత్రి పదవులను భర్తీ చేయడంతో పాటు కొందరు మంత్రుల శాఖల్లో మార్పులు, కుదింపులు ఉంటాయనే ప్రచారం కొంతకాలంగా సాగుతోంది. యువ ఎమ్మెల్యేలకు అవకాశాలు కల్పించాలన్న ఆలోచనతో పాటు.. సీనియర్లకు అన్యాయం జరగకుండా చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. రెడ్డి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల నుంచి పలువురు నేతలు మంత్రి పదవుల కోసం ఢిల్లీ స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

కర్ణాటక తరహాలో తెలంగాణలోనూ అసంతృప్తి పెరిగితే అది ప్రభుత్వంపై ప్రభావం చూపే అవకాశం ఉందని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా ఏళ్లుగా పార్టీలో కొనసాగుతున్న సీనియర్ నేతలను పూర్తిగా పక్కనపెట్టి కేవలం కొత్తవారికి ప్రాధాన్యం ఇస్తే ఎమ్మెల్యేల్లో అసమ్మతి పెరిగే ప్రమాదం ఉందని అంచనా వేస్తున్నారు. దీంతో కేబినెట్ బెర్తలతో పాటు ప్రత్యామ్నాయ పదవులపై కూడా దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

### సీనియర్లకు 'కాంపెన్సేషన్' ప్యాకేజీ

మంత్రి పదవి దక్కని కీలక నేతలకు నామినేటెడ్ పదవులు, కార్పొరేషన్ చైర్మన్ బాధ్యతలు, జిల్లా ఇన్‌చార్జ్ పదవులు లేదా ప్రభుత్వ సలహాదారు వంటి కీలక అవకాశాలు కల్పించే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. కేబినెట్ విస్తరణకు ముందే ఆశావహులతో చర్చలు పూర్తి చేసి.. ఎవరికి ఏ బాధ్యతలు దక్కుతాయనే దానిపై స్పష్టత ఇవ్వడం ద్వారా అసంతృప్తిని తగ్గించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

### జిల్లాల సమతుల్యతపైనా ఫోకస్

కేబినెట్ కూర్పులో సామాజిక సమీకరణాలతో పాటు ఉమ్మడి జిల్లాల ప్రాతినిధ్యాన్ని కూడా పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. నల్గొండ, ఖమ్మం, రంగారెడ్డి వంటి కీలక జిల్లాల ప్రాతినిధ్యం దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఒకవైపు యువతకు అవకాశం కల్పిస్తూ.. మరోవైపు సీనియర్లను సముచితంగా సర్దుబాటు చేయడం ద్వారా కేబినెట్ విస్తరణను వివాదరహితంగా పూర్తి చేయాలని రేవంత్ టీమ్ వ్యూహం రచిస్తున్నట్లు తెలుస్తోంది. కర్ణాటకలో జరిగిన పరిణామాలను తెలంగాణకు ముందస్తు హెచ్చరికగా భావిస్తున్న కాంగ్రెస్ అధిష్ఠానం.. కేబినెట్ విస్తరణ రోజున ఎలాంటి అసంతృప్తి, రాజీనామాల ప్రకటనలు రాకుండా ముందుగానే అన్ని వర్గాలను సమన్వయం చేయాలని సూచిస్తున్నట్లు సమాచారం. దీంతో రేవంత్‌రెడ్డి కేబినెట్ విస్తరణకు ఒకవైపు 'ప్లాన్‌ఏ'గా మంత్రి పదవుల భర్తీని కొనసాగిస్తూనే.. మరోవైపు సీనియర్లను సంతృప్తిపరిచే 'ప్లాన్‌బీ'ని సిద్ధం చేస్తున్నారన్న చర్చ కాంగ్రెస్ వర్గాల్లో సాగుతోంది.

# కేబినెట్ ప్రక్షాళనకు లైన్ క్లియర్



*రెండు ఖాళీల భర్తీకే కాంగ్రెస్ హైకమాండ్ మొగ్గు?*

**దశ హైదరాబాద్:** తెలంగాణలో రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తవుతున్నా.. కేబినెట్‌లో రెండు మంత్రి పదవులు ఇంకా ఖాళీగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో కేబినెట్ విస్తరణపై కాంగ్రెస్ అధిష్ఠానం కసరత్తు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే పూర్తిస్థాయి ప్రక్షాళనకు బదులుగా ప్రస్తుతానికి ఖాళీగా ఉన్న రెండు స్థానాలను మాత్రమే భర్తీ చేసే ఆలోచనలో హైకమాండ్ ఉన్నట్లు సమాచారం. ఈ నెల 14 తర్వాత వారం, పది రోజుల్లో విస్తరణపై ప్రకటన వెలువడే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

జులైలో ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ పలువురు మంత్రులతో వరుసగా సమావేశమై శాఖల పనితీరు, ప్రభుత్వంపై వస్తున్న విమర్శలు, నాయకుల మధ్య సమన్వయం వంటి అంశాలపై వివరాలు సేకరించారు. ఈ నేపథ్యంలో భారీగా మార్పులు చేపడితే పార్టీలో అసంతృప్తి పెరిగే అవకాశం ఉందని అధిష్ఠానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ప్రస్తుతానికి చిన్నపాటి విస్తరణకే పరిమితం కావాలని నిర్ణయించినట్లు సమాచారం.

గిరిజన, రెడ్డి సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించే దిశగా కసరత్తు జరుగుతున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎస్టీ కోటాలో రామచంద్ర నాయక్, బాలు నాయక్, దేవరకొండ ఎమ్మెల్యే పేర్లు వినిపిస్తుండగా.. రెడ్డి సామాజిక వర్గం నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేర్లు పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

మంత్రిపదవులు ఆశిస్తున్న వారి సంఖ్య ఎక్కువగా ఉండటంతో అసంతృప్తిని చల్లార్చడం సీఎం రేవంత్‌రెడ్డి, హైకమాండ్‌కు సవాల్‌గా మారింది. పదవులు దక్కని ఆశావహులకు నామినేటెడ్ పదవులు లేదా పార్టీ బాధ్యతలు అప్పగించి బుజ్జగించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తంగా భారీ రీషఫుల్‌కు బదులుగా రెండు ఖాళీలను భర్తీ చేసి సామాజిక సమతుల్యతను కొనసాగించడమే ప్రస్తుతానికి కాంగ్రెస్ వ్యూహంగా కనిపిస్తోంది.

## యూఏఈ బతుకమ్మ సంబరాలకు
# కేటీఆర్‌కు ఆహ్వానం

❖ అక్టోబర్ 11న దుబాయ్‌లో వేడుకలు



**దశ, హైదరాబాద్:** యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో నిర్వహించనున్న బతుకమ్మ సంబరాలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఈటీసీఏ-యూఏఈ) ప్రతినిధులు ఆహ్వానించారు. శుక్రవారం నంది నగర్‌లోని కేటీఆర్ నివాసంలో ఆయనను కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వేడుకల పోస్టర్‌ను కేటీఆర్ ఆవిష్కరించారు. ఈటీసీఏ ఆధ్వర్యంలో గత 16 ఏళ్లుగా యూఏఈలో బతుకమ్మ సంబరాలను నిర్వహిస్తున్నామని ప్రతినిధులు తెలిపారు. ఈ ఏడాది అక్టోబర్ 11న దుబాయ్‌లోని అల్ అహిలి స్పోర్ట్స్ క్లబ్‌లో బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నట్లు వివరించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా బతుకమ్మతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

### గల్ఫ్ కార్మికుల సమస్యలపై కేటీఆర్ ఆరా

ఈ సందర్భంగా ఈటీసీఏ ప్రతినిధులతో కేటీఆర్ సమావేశమై గల్ఫ్ దేశాల్లోని తెలంగాణ కార్మికుల పరిస్థితులు, ఉపాధి అవకాశాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. తెలంగాణకు దూరంగా ఉంటున్నప్పటికీ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్న ప్రవాస తెలంగాణ సంఘాల కృషిని అభినందించారు. గల్ఫ్‌లో తెలంగాణ కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమ వంతు సహకారం అందిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు.

## నడిరోడ్డుపై ఆగిపోయిన 108 అంబులెన్స్
*మరో అంబులెన్స్ వచ్చే వరకు రోగికి నరకయాతన*



**దశ, రాజన్న సిరిసిల్ల:** గంభీరావుపేట మండలం లక్ష్మీపూర్ తండాలో ఇంట్లో జారిపడి భూక్య జెమిలి(85) అనే వృద్ధురాలి కాలికి గాయం అయింది. 108 అంబులెన్స్ వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా, ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని రోడ్డుపై ఒక్కసారిగా వాహనం ఆగిపోయింది. మరో 108 వాహనం వచ్చే వరకు ఇబ్బంది పడుతూ అదే వాహనంలో వృద్ధురాలు వుండిపోయింది. నొప్పితో విలవిల్లాడుతూ వృద్ధురాలు రోదించింది.

## ఎస్ఐఆర్ ప్రక్రియపై కార్యకర్తలు దృష్టి సారించాలి
*అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు నమోదు పూర్తి చేయాలి: రాంచందర్‌రావు*




**దశ, హైదరాబాద్:** తెలంగాణలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) రెండో విడత ప్రక్రియపై బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు పిలుపునిచ్చారు. శనివారం ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, SIR రాష్ట్ర కన్వీనర్ వేముల అశోక్ అధ్యక్షతన జరిగిన రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు ఆగస్టు 10 వరకు మాత్రమే గడువు ఉన్నందున ప్రతి నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరి కొత్త ఓటు నమోదును ఫారమ్6 ద్వారా వేగంగా పూర్తి చేయించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. గడువు అనంతరం డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా పరిశీలన, నకిలీ ఓట్ల గుర్తింపు, అభ్యంతరాల దాఖలు వంటి కీలక ప్రక్రియలు కొనసాగుతాయని తెలిపారు. ఫారమ్7 ద్వారా ఓట్ల తొలగింపు, ఫారమ్8 ద్వారా సవరణలు సక్రమంగా చేపట్టాలని, నోటీసులకు అవసరమైన ఆధారాలతో సమాధానాలు ఇవ్వాలని బీఎల్ఏ1లు, లీగల్ టీమ్‌లకు సూచించారు. పోలింగ్ బూత్‌ల రేషనలైజేషన్‌ను కూడా క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటర్ల జాబితా పారదర్శకత కీలకమని, ఆ బాధ్యతను పార్టీ ప్రతినిధులు సమర్థవంతంగా నిర్వహించాలని రాంచందర్‌రావు కోరారు.

## ప్రశాంతంగా బోనాల పండుగను జరుపుకోవాలి



**దశ, బొల్లారం:** బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం నిర్వహించనున్న బోనాల పండుగను ప్రజలు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని స్టేషన్ హౌస్ అధికారి సుధీర్ కుమార్ కోరారు. బోనాల పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖ తరపున అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. పండుగ నిర్వాహకులు, ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.నిబంధనలకు విరుద్ధంగా ధ్వని పరికరాలను వినియోగించి ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలందరూ పోలీసు శాఖకు సహకరించి బోనాల పండుగను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని సుధీర్ కుమార్ కోరారు.



# స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా జీ5లో 'భారత్ భాగ్య విధాత'

26/11 ముంబై ఉగ్రదాడుల నేపథ్యంలో, తమ ప్రాణాలను పణంగా పెట్టి రోగులను కాపాడిన కామా ఆసుపత్రి సిబ్బంది అజ్ఞాత వీరగాథతో రూపుదిద్దుకున్న చిత్రం 'భారత్ భాగ్య విధాత'. కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో నటించి, నిర్మించిన ఈ చిత్రంలో గిరిజా ఓక్, స్మిత తాంబే కీలక పాత్రలు పోషించారు. మనోజ్ తపడియా దర్శకత్వంలో పెన్ స్టూడియోస్, మణికర్ణిక ఫిల్మ్స్ తదితర సంస్థలు సంయుక్తంగా ఈ థ్రిల్లర్ డ్రామాను నిర్మించాయి.స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 14న ఈ చిత్రం 'జీ5' (ZEE5) ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో డిజిటల్ ప్రీమియర్‌గా ప్రసారం కానుంది. సంక్షోభ సమయంలో నర్సులు, వార్డ్ బాయ్‌లు, ఇతర ఆరోగ్య కార్యకర్తలు ప్రదర్శించిన సాటిలేని ధైర్యసాహసాలు, నిస్వార్థ సేవలకు నివాళిగా ఈ చిత్రం తెరకెక్కింది. సరిహద్దుల్లో పోరాడే యోధులే కాకుండా, అత్యవసర సమయాల్లో బాధ్యతగా నిలబడే సామాన్యులు కూడా భారత స్ఫూర్తికి ప్రతీకలని చాటిచెప్పే ఈ చిత్రం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుందని చిత్రబృందం ధీమా వ్యక్తం చేసింది.

# స్టువర్టుపురం స్టూడెంట్స్ ట్రైలర్ రిలీజ్

బిగ్ బాస్ ఫేమ్ నిఖిల్ మలియాకల్, దివి వద్యా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఎమోషనల్ యాక్షన్ ఎంటర్టైనర్ 'స్టువర్టుపురం స్టూడెంట్స్'. డి. రామకృష్ణ దర్శకత్వంలో శివ సాయి ప్రొడక్షన్స్ పై ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ సినిమా ట్రైలర్, ఒక ప్రత్యేక పాటను ప్రముఖ దర్శకుడు వేణు ఉడుగుల చేతుల మీదుగా గ్రాండ్‌గా లాంచ్ చేశారు. ఈ చిత్రంలో దివి యాక్షన్, డ్యాన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఈ సినిమాలో ఒక పాట కోసం తాను భరతనాట్యంతో పాటు బెల్లీ డ్యాన్స్ కూడా చేసినట్లు దివి తెలిపారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు ముమ్మరంగా జరుగుతున్న ఈ చిత్రాన్ని త్వరలోనే థియేటర్లలో విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.




# బంగారు బోనం ఎత్తిన నిహారిక కొణిదెల


హైదరాబాద్ బోనాల వేడుకల్లో భాగంగా సినీ నటి, నిర్మాత నిహారిక కొణిదెల పాతబస్తీ మీరాలం మండిలోని శ్రీ మహంకాళేశ్వర ఆలయంలో అమ్మవారికి బంగారు బోనం సమర్పించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ గాజుల అంజయ్య ఆమెను శాలువాతో సత్కరించి, ఆలయ చరిత్రను వివరించారు. ఈ సందర్భంగా నిహారిక మాట్లాడుతూ.. బోనాల పండుగ వాతావరణం తనకు ఎంతో ఇష్టమని, అమ్మవారికి బోనం ఎత్తాలనే కోరిక ఇంత త్వరగా నెరవేరడం ఆ దేవి అనుగ్రహమేనని ఆనందం వ్యక్తం చేశారు. నిహారిక రాకతో ఆలయ ప్రాంగణంలో భక్తుల కోలాహలం నెలకొంది.



# గులాబీ విరాళాలకు భారీ బ్రేక్

- రూ.85 కోట్ల నుంచి రూ.15 కోట్లకు.. 82 శాతం పతనం
- అధికారం పోయిన తర్వాత భారీగా తగ్గిన నిధుల ప్రవాహం.. ఏడీఆర్ నివేదికలో కీలక అంశాలు






**దశ, హైదరాబాద్:** తెలంగాణలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్‌కు రాజకీయంగా ఎదురుదెబ్బ తగలడమే కాకుండా.. ఆ పార్టీ ఆర్థిక పరిస్థితిపైనా ప్రభావం పడినట్లు తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) విడుదల చేసిన నివేదిక ప్రకారం.. 202425 ఆర్థిక సంవత్సరంలో బీఆర్ఎస్‌కు రూ.20 వేలకుపైగా వచ్చిన విరాళాలు ఏకంగా 82 శాతం తగ్గాయి. 202324లో 8 మంది దాతల నుంచి రూ.85 కోట్ల విరాళాలు అందుకున్న పార్టీ.. 202425లో కేవలం 4 మంది దాతల నుంచి రూ.15 కోట్లు మాత్రమే సమీకరించింది.

### అధికార మార్పుతో తగ్గిన విరాళాల ప్రవాహం

తెలంగాణ ఏర్పడిన తర్వాత దాదాపు పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌కు.. అధికారం కోల్పోయిన తర్వాత విరాళాల రూపంలో భారీ తగ్గుదల కనిపించింది. ఏడీఆర్ విశ్లేషణ ప్రకారం గత ఏడాదితో పోలిస్తే బీఆర్ఎస్ రూ.70 కోట్ల మేర విరాళాలను నికరంగా కోల్పోయింది. దేశవ్యాప్తంగా విశ్లేషించిన ప్రాంతీయ పార్టీల్లో అత్యధికంగా విరాళాలు కోల్పోయిన పార్టీల్లో బీఆర్ఎస్ ముందువరుసలో నిలిచింది.

గతంలో రద్దైన ఎలక్టోరల్ బాండ్ల ద్వారా బీఆర్ఎస్ రూ.495 కోట్ల వరకు నిధులు సమీకరించింది. తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ పార్టీల్లో అత్యధికంగా ఎలక్టోరల్ బాండ్ల నిధులు పొందిన పార్టీగా అప్పట్లో బీఆర్ఎస్ నిలిచింది. అయితే అధికారం మారిన తర్వాత పార్టీకి వచ్చే విరాళాల పరిమాణం గణనీయంగా తగ్గడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీస్తోంది.

### ఎంఐఎం విరాళాలు సున్నా

తెలంగాణకు చెందిన మరో ప్రధాన ప్రాంతీయ పార్టీ ఎంఐఎంకు కూడా విరాళాల విషయంలో ఇదే తరహా పరిస్థితి ఎదురైంది. 202324 ఆర్థిక సంవత్సరంలో 16 విరాళాల ద్వారా రూ.9 లక్షలు అందుకున్నట్లు ప్రకటించిన ఎంఐఎం.. 2024 25లో రూ.20 వేలకుపైగా వచ్చిన విరాళాలు సున్నాగా చూపించింది. దేశవ్యాప్తంగా గత ఏడాది రూ.20 వేలకుపైగా విరాళాలు ప్రకటించి.. మరుసటి ఏడాది వాటిని సున్నాగా చూపిన మూడు పార్టీల్లో ఎంఐఎం ఒకటిగా ఉందని ఏడీఆర్ పేర్కొంది.

### నివేదికల సమర్పణలోనూ ఆలస్యం

విరాళాల వివరాలను ఎన్నికల సంఘానికి సమర్పించడంలోనూ బీఆర్ఎస్, ఎంఐఎం ఆలస్యం చేసినట్లు ఏడీఆర్ నివేదిక వెల్లడించింది. 202324 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వివరాలను రెండు పార్టీలు నిర్ణీత సమయంలోనే సమర్పించగా.. 202425కి సంబంధించిన నివేదికల్లో మాత్రం ఆలస్యం జరిగింది. బీఆర్ఎస్ గడువు కంటే 9 రోజులు ఆలస్యంగా నివేదిక అందజేయగా.. ఎంఐఎం 28 రోజుల ఆలస్యంతో వివరాలను సమర్పించింది.

అధికారం మారిన తర్వాత రాజకీయ పార్టీలకు వచ్చే విరాళాల్లో ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటున్నాయో ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్ విషయంలో రూ.85 కోట్ల నుంచి రూ.15 కోట్లకు విరాళాలు పడిపోవడం పార్టీ ఆర్థిక వ్యవహారాల్లో చోటుచేసుకున్న భారీ మార్పుగా రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## మద్యం ధరల పెంపు

**మొదటి పేజీ తరువాయి**

రాష్ట్రంలో చివరిసారిగా 202223 ఆర్థిక సంవత్సరంలో మద్యం ధరలు సవరించారు. ముడిసరుకులు, రవాణా, సిబ్బంది జీతాలు, పన్నుల భారం పెరిగిన నేపథ్యంలో ధరలు పెంచాలని డిస్టిలరీలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ప్రస్తుతం 10 నుంచి 15 శాతం వరకు పెంపు కోరుతున్నట్లు సమాచారం. అయితే భారీగా ధరలు పెంచితే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక నుంచి మద్యం అక్రమ రవాణా పెరిగే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. పొరుగు రాష్ట్రాల ధరలను పరిశీలించిన తర్వాతే తుది పెంపు శాతాన్ని ఖరారు చేయనున్నట్లు తెలుస్తోంది.

## పెద్ది కుటుంబానికి కేసీఆర్ అండ

**మొదటి పేజీ తరువాయి**

పార్టీ సీనియర్లు, వరంగల్ జిల్లా ముఖ్య నేతలతో చర్చించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మ కార్యక్రమాలు పూర్తయిన తర్వాత జిల్లా పార్టీ ముఖ్య నేతలు సమావేశమై కుటుంబ సంక్షేమానికి సంబంధించి తదుపరి నిర్ణయాలు తీసుకుంటారని పేర్కొన్నారు. పెద్ది కుటుంబానికి ఎల్లప్పుడూ పార్టీ అండగా ఉంటుందని కేసీఆర్ హామీ ఇచ్చారు.

## రేవంత్‌కు రైతులపై కనీస పరిజ్ఞానం లేదు

**దశ, హైదరాబాద్:** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తమకు క్షుద్ర రాజకీయాలు తెలియవని, కాంగ్రెస్ నేతలే క్షుద్ర పూజల పేరుతో రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. శనివారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన కేటీఆర్.. మాజీ మంత్రి హరీశ్‌రావు గుడికి వెళ్లడం తప్పా? అని ప్రశ్నించారు. రైతుల సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డికి కనీస పరిజ్ఞానం లేదని కేటీఆర్ ఆరోపించారు. బీఆర్ఎస్ డిమాండ్ చేసిన తర్వాతే పంప్‌లు ఎందుకు ఆన్ చేశారని ప్రశ్నించారు. ఎప్పుడు నీటిని ఎత్తిపోసుకోవాలో కూడా సీఎంకు తెలియదని విమర్శించారు. రైతుల సమస్యలపై హరీశ్‌రావు ప్రశ్నించినా కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని నిలదీశారు.

### సీఎం దృష్టిలో భూమి అంటే రియల్ ఎస్టేట్: కేటీఆర్

తమకు స్ట్రెయిట్ రాజకీయాలు మాత్రమే తెలుసునని కేటీఆర్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టిలో భూమి అంటే రియల్ ఎస్టేట్ మాత్రమేనని ఎద్దేవా చేశారు. కృష్ణా జలాలకు సంబంధించిన GRMB ఎజెండాలో ఏడు వివాదాస్పద అంశాలు ఉన్నాయని కేటీఆర్ ప్రస్తావించారు. రైతుల ప్రయోజనాలు, రాష్ట్ర హక్కుల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన వైఖరి అవలంబించాలని డిమాండ్ చేశారు.

## బోనాల సందర్భంగా ప్రముఖ ఆలయాలకు పట్టు వస్త్రాలు

**మొదటి పేజీ తరువాయి**

కొండా సురేఖ, కార్వాన్ శ్రీ దర్బార్ మైసమ్మ ఆలయంలో మంత్రి దామోదర రాజనర్సింహ, సుల్తాన్‌షాహి శ్రీ బంగారు మైసమ్మ ఆలయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొంటారు.

హరిబౌలిలోని శ్రీ అక్కన్న మాదన్న ఆలయంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, చిలకలగూడ శ్రీ కట్ట మైసమ్మ ఆలయంలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అంబర్‌పేట శ్రీ మహంకాళి ఆలయంలో దనసరి అనసూయ సీతక్క, సబ్జీ మండి శ్రీ నల్ల పోచమ్మ ఆలయంలో తుమ్మల నాగేశ్వరరావు, రాంబక్షబండ శ్రీ బంగారు మైసమ్మ ఆలయంలో జూపల్లి కృష్ణారావు పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు.

భేలా శ్రీ ముత్యాలమ్మ ఆలయంలో గడ్డం వివేక్ వెంకటస్వామి, సుల్తాన్‌షాహి శ్రీ జగదాంబ ఆలయంలో అడ్లూరి లక్ష్మణ్ కుమార్, గౌలిపూర శ్రీ మహంకాళి ఆలయంలో వాకిటి శ్రీహరి, హరిబౌలి శ్రీ నల్ల పోచమ్మ ఆలయంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, హరిబౌలి శ్రీ బంగారు మైసమ్మ ఆలయంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు పాల్గొంటారు.

బోయిగూడ శ్రీ బంగారు మైసమ్మ ఆలయంలో కె. కేశవరావు, అద్దంకి దయాకర్, నాచారం శ్రీ మహంకాళి సమేత మహంకాళేశ్వర ఆలయంలో పి. సుదర్శన్ రెడ్డి, గౌలిగూడ శ్రీ మహంకాళి ఆలయంలో హర్కర వేణుగోపాల్ రావు, ఎల్బీనగర్ శ్రీ ఖిల్లా మైసమ్మ ఆలయంలో ప్రభుత్వ విప్‌లు పొచారం శ్రీనివాస్ రెడ్డి, ఆది శ్రీనివాస్ పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు.

## 40 ఆధార్ నంబర్లు.. 80 మంది ఉద్యోగులు!

**మొదటి పేజీ తరువాయి**

ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను మరింత పారదర్శకంగా మార్చేందుకు ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్‌లో ఉద్యోగుల ఆధార్, సర్వీస్ వివరాలను ధృవీకరించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ క్రమంలో చేపట్టిన క్రాస్‌చెకింగ్‌లోనే అనుమానాస్పద వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

### 40 ఆధార్‌లకు 80 మంది ఉద్యోగుల వివరాలు

ఆర్థిక శాఖ ప్రాథమిక పరిశీలనలో కేవలం 40 ఆధార్ నంబర్లకు ఏకంగా 80 మంది ఉద్యోగుల వివరాలు అనుసంధానమై ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. అంటే ఒక్కో ఆధార్ నంబర్‌కు ఇద్దరు ఉద్యోగుల వివరాలు నమోదై ఉన్నాయి. వీరిలో ఎక్కువ మంది రెగ్యులర్ ఉద్యోగులేనని సమాచారం. ఉద్యోగుల హోదాను బట్టి నెలకు రూ.లక్ష నుంచి రూ.4 లక్షల వరకు జీతాలు చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. పోలీసు, రెవెన్యూ, విద్య, పంచాయతీరాజ్, ప్రజారోగ్య శాఖల్లో ఇలాంటి డూప్లికేట్ వివరాలు ఎక్కువగా గుర్తించినట్లు సమాచారం.

### సాంకేతిక తప్పిదమా.. భారీ మోసమా?

ఐఎఫ్ఎంఐఎస్ వ్యవస్థలోని రెగ్యులర్, గ్రాంట్‌ఇన్‌ఎయిడ్, తాత్కాలిక సిబ్బంది వివరాలను ఆధార్‌తో అనుసంధానించి క్రాస్‌చెక్ చేయడంతో ఈ వ్యవహారం బయటపడింది. వేర్వేరు శాఖల్లో, వేర్వేరు పేర్లతో ఉద్యోగాలు చేస్తూ ఒకే ఆధార్ నంబర్ ఉపయోగించడంపై అధికారులు తీవ్రంగా దృష్టి సారించారు. ఇది డేటా ఎంట్రీలో జరిగిన పొరపాటా? సాంకేతిక లోపమా? లేక ఉద్దేశపూర్వకంగా జరిగిన ఐడెంటిటీ ఫ్రాడ్‌నా? అన్నది సమగ్ర విచారణలో తేలాల్సి ఉంది.

### ఏడు రోజుల్లో నివేదిక.. అక్రమ సొమ్ము రికవరీ

డూప్లికేట్ ఆధార్ మ్యాపింగ్‌లపై తక్షణమే సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించినట్లు సమాచారం. ఒకే వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ ప్రభుత్వ సంస్థలు లేదా శాఖల నుంచి అక్రమంగా జీతాలు పొందినట్లు రుజువైతే శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలతో పాటు ఇప్పటివరకు తీసుకున్న ప్రభుత్వ సొమ్మును పూర్తిగా రికవరీ చేయాలని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. తీవ్రమైన అక్రమాలు నిర్ధారణ అయితే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, ఈ వ్యవహారానికి సహకరించిన అధికారులు, జీతాల చెల్లింపులో నిర్లక్ష్యం వహించిన డీడీవోల బాధ్యతను కూడా నిర్ధారించాలని ఆదేశించినట్లు సమాచారం. విచారణ, రికవరీ, క్రిమినల్ చర్యల వివరాలతో కూడిన యాక్షన్ టేకెన్ రిపోర్టును అన్ని శాఖలు ఏడు రోజుల్లో సమర్పించాలని ఆర్థిక శాఖ ఆదేశించినట్లు తెలుస్తోంది. దీంతో ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ఉద్యోగులు, అధికారుల్లో ఆందోళన మొదలైంది.

## క్యాంపస్ లైఫ్.. రియల్ లైఫ్‌కు చాలా తేడా

**మొదటి పేజీ తరువాయి**

ఐఐటీ పరీక్షలకు సిలబస్, ప్రశ్నపత్రం ఉంటాయని.. కానీ జీవితమనే పరీక్షకు నిర్దిష్టమైన సిలబస్, ప్రశ్నపత్రం ఉండవని చెప్పారు. చాలాసార్లు అసలు సమస్య ఏమిటో కూడా ఎవరూ చెప్పరని, దాన్ని మనమే గుర్తించి పరిష్కరించాల్సి ఉంటుందని విద్యార్థులకు సూచించారు. ప్రతి విద్యార్థి భవిష్యత్తుపై తనదైన కలలు, ఆలోచనలు కలిగి ఉంటారని మోదీ అన్నారు. కొందరు మొదటి జీతం కోసం ఎదురుచూస్తుంటే.. మరికొందరు కొత్త నగరంలో కొత్త జీవితాన్ని ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారని చెప్పారు. ఇంకొందరు తమ తొలి స్టార్టప్ గురించి కలలు కంటున్నారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి మార్గం, కల భిన్నమైనప్పటికీ.. దేశానికి సేవ చేయాలనే సంకల్పం అందరిలో ఉండాలని ఆకాంక్షించారు.

## హైడ్రాలో 150 ఉద్యోగాలు.. వేలల్లో అభ్యర్థులు!

**మొదటి పేజీ తరువాయి**

అభ్యర్థులు 800 మీటర్ల పరుగు, 100 మీటర్ల స్ప్రింట్, లాంగ్‌జంప్, షాట్‌పుట్ వంటి ఈవెంట్లలో అర్హత సాధించాల్సి ఉంటుంది.

### అదుపుతప్పిన పరిస్థితి.. రంగంలోకి పోలీసులు

ప్రకటించిన పోస్టుల సంఖ్యతో పోలిస్తే భారీ సంఖ్యలో నిరుద్యోగులు తెల్లవారుజామునే స్టేడియం వద్దకు చేరుకున్నారు. లోపలికి వెళ్లేందుకు ఒక్కసారిగా పెద్ద సంఖ్యలో అభ్యర్థులు ప్రయత్నించడంతో ఒకరినొకరు తోసుకోవడంతో పరిస్థితి అదుపుతప్పింది. దీంతో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని గుంపును చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

### వైరల్‌గా మారిన తోపులాట వీడియో



సరూర్‌నగర్ స్టేడియం వద్ద జరిగిన తోపులాటకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కేవలం 150 ఉద్యోగాల కోసం వేలాది మంది తరలిరావడం రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాలపై ఉన్న తీవ్ర పోటీని, నిరుద్యోగ సమస్య తీవ్రతను ప్రతిబింబిస్తోందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

### హైడ్రాపై హైకోర్టు మళ్లీ ఆగ్రహం

సల్కం చెరువు ఆక్రమణలపై చర్యలు తీసుకోకపోవడంపై నోటీసులు సల్కం చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లోని అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడంలో జాప్యం చేయడంపై తెలంగాణ హైకోర్టు హైడ్రాపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. గతంలో ఇచ్చిన ఆదేశాలు అమలు చేయకపోవడాన్ని కోర్టు ధిక్కరణగా పరిగణించింది.

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్‌తో పాటు రెవెన్యూ, నీటిపారుదల, విద్యాశాఖల ఉన్నతాధికారులకు కోర్టు నోటీసులు జారీ చేసింది. అధికారులు కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 11కు వాయిదా వేసింది. అధికారుల వివరణ సంతృప్తికరంగా లేకపోతే కోర్టు ధిక్కరణ చట్టం1971 కింద సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకునే అవకాశం ఉందని హైకోర్టు హెచ్చరించింది. దీంతో సల్కం చెరువు ఆక్రమణల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

## 100 ఎకరాల్లో అత్యాధునిక బస్ డిపో

**మొదటి పేజీ తరువాయి**

ఈ ప్రాంతంలో బస్ డిపో, టెర్మినల్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం భావిస్తోంది.

హెచ్ఎంటీ భూములపై భిన్నాభిప్రాయాలు

మొదట జగద్గిరిగుట్ట ప్రాంతంలో హెచ్ఎంటీకి చెందిన భూములను టీజీఎస్ఆర్టీసీ పరిశీలించింది. 99 ఏళ్లకు లీజుకు తీసుకుని బస్ డిపో, టెర్మినల్ నిర్మించాలని ప్రతిపాదించింది. అయితే హెచ్ఎంటీ అధికారులు 99 ఏళ్లకు భూమిని లీజుకు ఇచ్చేందుకు అంగీకరించలేదు. ఐదేళ్ల చొప్పున గరిష్ఠంగా 20 ఏళ్లకు మాత్రమే లీజుకు ఇవ్వగలమని స్పష్టం చేశారు. ఇందుకు ఏడాదికి రూ.6 కోట్ల లైసెన్స్ ఫీజు చెల్లించాలని ప్రతిపాదించగా.. టీజీఎస్ఆర్టీసీ దీనికి అంగీకరించలేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా గాజులరామారం సమీపంలో 100 ఎకరాల భూమిని టీజీఎస్ఆర్టీసీకి కేటాయించినట్లు గద్కరీ తెలిపారు. ఈ స్థలంలో భారీ స్థాయిలో బస్ డిపోతో పాటు ప్రయాణికులకు అవసరమైన ఆధునిక సౌకర్యాలతో టెర్మినల్ నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

### ఇంటర్‌స్టేట్ బస్సులకు ప్రత్యేక టెర్మినల్

కొత్త డిపోలో తెలంగాణ జిల్లాల నుంచి వచ్చే బస్సులతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు వచ్చే బస్సుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు.

## రేవంత్ లెక్కలోకి బనకచర్ల ప్రాజెక్ట్ రిజెక్ట్!

**మొదటి పేజీ తరువాయి**

ఈ నేపథ్యంలో అవసరమైన వివరాలు, నివేదికలను సమర్పించాలని కేంద్రం సూచించినట్లు తెలుస్తోంది.

### పొరుగు రాష్ట్రాల అభ్యంతరాలు కీలకం

పోలవరం-బనకచర్ల ప్రతిపాదనపై తెలంగాణతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రయోజనాలు కూడా ముడిపడి ఉన్నాయి. గోదావరి జలాల వినియోగం, మిగులు జలాల లభ్యత, భవిష్యత్తులో ఏర్పడే ముంపు ప్రభావాలపై ఆయా రాష్ట్రాల నుంచి అభ్యంతరాలు వచ్చే అవకాశం ఉంది. గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్ నిబంధనలు, అంతర్రాష్ట్ర ఒప్పందాలకు అనుగుణంగా అన్ని రాష్ట్రాల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

ఈ ప్రాజెక్టు ద్వారా గోదావరి నుంచి సుమారు 200 టీఎంసీల వరద నీటిని రాయలసీమకు తరలించి, దాదాపు 80 లక్షల మందికి తాగునీరు, మూడు లక్షల హెక్టార్లకు సాగునీరు అందించాలని ఏపీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రతిపాదనలు చెబుతున్నాయి. ఇంత భారీ ప్రాజెక్టుకు నీటి లభ్యతపై శాస్త్రీయమైన లెక్కలు, ముంపు వివరాలు, అంతర్రాష్ట్ర సమ్మతి వంటి అంశాలు కీలకంగా మారనున్నాయి.



### ప్రాజెక్టు రద్దు కాదు.. ముందున్నది ప్రక్రియ

ప్రతిపాదనలు వెనక్కి రావడాన్ని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ విజయంగా చూస్తున్నప్పటికీ.. దీనిని ప్రాజెక్టు పూర్తిగా రద్దైనట్లుగా భావించలేమని స్పష్టమవుతోంది. కేంద్రం సూచించిన లోపాలను సరిదిద్ది, సీడబ్ల్యూసీ నుంచి అవసరమైన నివేదికలు పొందడంతో పాటు పొరుగు రాష్ట్రాల అభ్యంతరాలను పరిష్కరించిన తర్వాత ఏపీ ప్రభుత్వం మళ్లీ అనుమతుల కోసం ముందుకు వెళ్లే అవకాశం ఉంది.

అందువల్ల బనకచర్ల ప్రాజెక్టుపై ప్రస్తుత పరిణామం రాజకీయంగా ఏపీ ప్రభుత్వానికి ఎదురుదెబ్బగా కనిపించినా.. సాంకేతిక, చట్టపరమైన ప్రక్రియలను పూర్తి చేసేందుకు కేంద్రం ఇచ్చిన మార్గదర్శకంగా కూడా చూడొచ్చు. ఇక పొరుగు రాష్ట్రాలతో సంప్రదింపులు, నీటి లభ్యతపై స్పష్టత, పర్యావరణ అంశాల పరిష్కారమే ఈ ప్రాజెక్టు భవిష్యత్తును నిర్ణయించనున్నాయి.

## కాక్రోచ్ పార్టీకి నిధులెలా వస్తున్నాయ్?

**మొదటి పేజీ తరువాయి**

సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే కుటుంబ ఆదాయం, శంభాజీనగర్‌లోని ఆయన కుటుంబ నివాసం విలువ, అక్కడి కార్యకలాపాలకు సంబంధించిన అంశాలపై సోషల్ మీడియాలో, రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆయన విద్య, అమెరికాలో చదువుకున్నట్లు చెబుతున్న వివరాలపైనా స్పష్టత కోరుతున్న వారు ఉన్నారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారిక ఆధారాలు, స్వతంత్ర ధ్రువీకరణ అవసరం ఉంది.

### నాయకుల జీవనశైలిపై ప్రశ్నలు

ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ నాయకురాలు నేహా బోరా, సౌరభ్ దాస్ తదితరుల జీవన విధానం, ఉద్యమ కార్యకలాపాలకు సంబంధించిన ఖర్చులపై కూడా ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా దీర్ఘకాలిక ఉద్యమాల్లో పాల్గొనే నాయకులు తమ జీవన వ్యయాలు, ప్రయాణాలు, కార్యక్రమాల నిర్వహణకు అయ్యే ఖర్చులను ఎలా సమకూర్చుకుంటున్నారనే అంశంపై పారదర్శకత ఉండాలని పలువురు కోరుతున్నారు. సీజేపీకి నిధులు సమకూరుతున్న విధానం, పార్టీ కార్యకలాపాలకు అయ్యే ఖర్చులు, విరాళాల వివరాలు వంటి అంశాలపై బహిరంగంగా సమాచారం అందుబాటులో లేకపోవడం కూడా చర్చకు కారణమవుతోంది. పార్టీ రిజిస్ట్రేషన్, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడిస్తే అనేక అనుమానాలకు సమాధానం లభించే అవకాశం ఉంది.

### స్పష్టత ఇస్తేనే విశ్వసనీయత

ప్రజలను, ప్రభుత్వాలను ప్రశ్నించే ఉద్యమాలు తమ ఆర్థిక వ్యవహారాల్లోనూ పారదర్శకంగా ఉండాలని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. నాయకులపై వస్తున్న ఆరోపణలు నిజమా? కాదా? అనే విషయాన్ని సంబంధిత వ్యక్తుల వివరణలు, అధికారిక రికార్డులు, స్వతంత్ర ఆధారాలే తేల్చాలి. నిధుల మూలాలు, ఖర్చుల వివరాలు బహిరంగం చేస్తే సీజేపీపై వస్తున్న అనుమానాలకు స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com